# ప్రేమ పురాణం

-దీవి లక్ష్మీరాజేశ్వరి

(గతసంచిక తరువాయి)

2

ఒక కోర్టు కేసులో హియరింగ్ వుండటంతో తప్పనిసరై కోర్టుకెళ్ళాడు సులేమాన్. సన్‌స్ట్రోక్ తర్వాత అతను యింకా సరిగ్గా కోలుకోను కూడా లేదు. కానీ అతను మొండిపట్టు పట్టాడు. ఎందుకంటే ఈ కేసుతో సులేమాన్ భవిష్యత్తు ముడిపడి వుంది. ఈ కేసులో ఎలాగైనా సరే తాను తప్పనిసరిగా గెలిచి తీరుతానని గట్టి నమ్మకం వుంది సులేమాన్‌కి. ఎందుకైనా మంచిదనే ఉద్దేశ్యంతో డాక్టర్ భార్గవని కూడా సులేమాన్‌తోపాటు పంపించాడు సంజయ్.

సంజయ్ ఆఫీసులో కూర్చుని పోస్ట్ చూస్తున్నాడు. సులేమాన్ తిరిగి వచ్చే లోగానే ఈ పని ముగించాలన్నది అతని ప్రయత్నం. సులేమాన్ మానసికంగా తిరిగి ఎలాంటి వత్తిడికీ గురికాకూడదని శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు సంజయ్.

పనులన్నీ ముగించుకునేసరికి అలసటగా అనిపించింది సంజయ్‌కి. తనే లేచి ఒక మూలన టేబుల్‌మీద వున్న కాఫీ పర్క్యులేటర్ స్విచ్ ఆన్ చేశాడు. చూస్తూ చూస్తూండగానే కెటిల్‌లో నీళ్ళు కుతకుత ఉడకటం ప్రారంభించాయి. తనకోసం ఒక కప్పు కాఫీ కలువుకున్నాడు సంజయ్.

"నాకూ ఓ కప్పు కాఫీ-ప్లీజ్!"

వెనక్కి తిరిగి చూశాడు సంజయ్.

ఇమ్రాన్! సులేమాన్ మేనల్లుడు. ఆరోగ్యంగా, అందంగా, ఆకర్షణీయంగా కనిపించే చురుకైన యువకుడు.

ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు సంజయ్.

"ఇమ్రాన్! హౌ ఆర్ యూ?" అన్నాడు.

"వెల్!" అంటూ సంజయ్‌కి దగ్గరగా వచ్చి "నాకు మాత్రం కాఫీ చాలా స్ట్రాంగ్‌గా వుండాలి" అన్నాడు.

"ఇంతకీ మీరు షార్జా నుంచి ఎప్పుడు వచ్చారు?" కాఫీ కలువుతూ అడిగాడు సంజయ్.

"జస్ట్, ఇప్పుడే వచ్చాను. రావటం రావటం నేరుగా యిక్కడికే వచ్చాను."

"మామయ్యకి మీరు వస్తూన్న సంగతి తెలియజేశారా?"

"ఆయనే ఫోన్ చేశారు-ఏదో అర్జంట్ పనివుంది రమ్మన్నారు."

"అవును. గుర్తుకు వచ్చింది. మీరు కొన్ని బ్యాంక్ పేపర్స్ మీద సంతకాలు పెట్టాలి.

"మామయ్య ఆరోగ్యం ఎలా వుంది?"

"చాలా వరకు కోలుకున్నారు. ఈ రోజు కోర్టుకు వెళ్ళారు"





"ఆయన్ని ఎందుకు వెళ్ళనిచ్చారు మీరు?"

"కంగారు పడకండి.. డాక్టర్ భార్గవ కూడా ఆయన వెంట ఉన్నారు."

"అయితే పర్లేదు" సంజయ్ చేతి లోంచి కాఫీకప్పు అందుకుంటూ అన్నాడు ఇమ్రాన్. చకచకా కాఫీ సిప్ చేసికప్పు టేబిల్ మీదపెట్టా..

"ఎక్స్‌క్యూజ్‌మీ!" అంటూ సంజయ్ టేబుల్ సొరుగులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి అందులోంచి ఓ సిగరెట్ తీసి నోట్లోపెట్టుకుని లైటర్‌తో వెలిగించుకున్నాడు.

"మీరు సిగిరెట్లు కాల్చకండి, ఇమ్రాన్" నవ్వుతూ సలహా యిచ్చాడు సంజయ్.

"ఎందుకు?" స్టైల్‌గా పొగ వదులుతూ అడిగాడు ఇమ్రాన్.

"సిగరెట్లు కాల్చడం మీ మామయ్యకు యిష్టం వుండదు"

"మామయ్య పాతకాలం మనిషి. ఆయన యిష్టాయిష్టాలన్నీ మనం పట్టించుకుంటూపోతే మనం అసలు ఏమీ చేయలేం."

"ఆయనకు యింకా యిష్టంలేని అంశాలు ఏమున్నాయి?" ఆసక్తిగా అడిగాడు ఇమ్రాన్.

"సిగరెట్లు, మద్యం, మగువలతో పొందు, ఆటా పాటా, ఏదీ యిష్టం వుండదు ఆయనకు. ఇవేం లేకపోతే జీవితంలో ఇంకేముంది అనుభవించడానికి."

"ఆనందం అనేది కేవలం విలాసాల్లోనే వుండదు, ఇమ్రాన్"

"మరి ఎందులో వుంటుంది?"

"ప్రేమలో..." అనుకోకుండా సంజయ్ నోట్లోంచి వెలువడింది యీ మాట. అనేసిన తర్వాతగానీ తట్టలేదు సంజయ్‌కి, తాను తొందరపడి నోరు జారానని.

"నాకు ప్రేమించే హక్కు లేదు."

"ఎందుకని?"

"మామయ్య చిన్నప్పుడే నా కాళ్ళకు, హృదయానికీ బంధాలు వేశారు. నేను ఆయన కూతురినే చేసుకుని తీరాలి"

"ఏ కూతురు?"

"ఆయనకుందే ఒక్కగానొక్క కూతురు–షాహన్!"

"షాహన్!?" ఆ పేరు వినటంతోనే సంజయ్ ఎందుకోగాని నిలువెల్లా కంపించి పోయాడు.

"అవును. లండన్‌లో చదువుకుంటోంది'

'చాలా అందమైన పేరు. అరబ్బుల అందమంతా మూర్తీభవించి వుంటుందనుకుంటాను'

'పేరు మాత్రమే అరబ్బీ పేరు. అందచందాలు, స్టయిలు, కల్చర్ అంతా యూరోపియనులదే. అచ్చమైన యూరోపియన్ అమ్మాయిలా వుంటుంది"

"అలాంటి అమ్మాయితో ఎడ్జస్ట్ అవుతారా మరి మీరు?"

"మగాణ్ణి కదా! పెళ్ళయ్యాక పనికిమాలిన లక్షణాలన్నీ తీసివేస్తాను" రొమ్ము విరుచుకుంటూ అన్నాడు ఇమ్రాన్. అతని మాటల్నిండా పురుషాహంకారం తొణికిసలాడుతోంది.

'అంటే, షాహన్ అంటే మీకు ఇష్టమేనన్నమాట!"

"అందగత్తె, బాగా చదువుకుంది– ఎవరైనా ఇష్టపడతారు. నేనవే ఏమిటి! అదీ గాక నా మామయ్య కూతురు. చిన్నప్పటి నుంచీ తెలిసినవాళ్ళం"

వీళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ వుండగా బయట కారు హారన్ వినిపించింది.

ఇమ్రాన్ కారు హారన్‌ని గుర్తించి కంగారు పడ్డాడు. అతని చేతుల్లో సిగరెట్ వెలుగుతోంది. వెంటనే దాన్ని కేబిన్ లోంచి బయటికి విసిరేశాడు. అనుకోకుండా అది టేబుల్‌కి తగిలి కార్పెట్ చివర పడిపోయింది. ఇమ్రాన్ దాన్ని అక్కడి నుంచి తీసి బయటికి విసిరేద్దామనుకుంటూండగానే సులేమాన్ లోపలికి వచ్చేశాడు. ఆయన వెంట డాక్టర్ భార్గవ కూడా వున్నారు.

సంజయ్, ఇమ్రాన్‌లు ఇద్దరూ లేచి నిలబడి విష్ చేశారు.

సులేమాన్ నవ్వుతూ తల దించి ప్రత్యభివాదం చేస్తూ "తీర్పు మనకు అనుకూలంగా వచ్చింది" అన్నాడు.

"అయితే ఇక నీలోఫర్ మహల్ మనదేనన్నమాట!' ఇమ్రాన్ పట్టలేని ఆనందంతో ఎగిరి గంతేసినంత పనిచేశాడు.

"అవును"

"అయితే పదండి మామయ్యా! ఇంక ఆలస్యం దేనికి? ఇప్పుడే స్వాధీనం చేసుకుందాం"

"అంత తొందర పనికిరాదు ఇమ్రాన్." సులేమాన్‌కి బదులు డాక్టర్ భార్గవ సమాధానం ఇచ్చాడు. "ఇంకా లీగల్ అంశాలు కొన్ని పెండింగ్‌లో వున్నాయి. ఆర్డరు చేతికి అందాక నీతో పాటు మేమూ వస్తాం"

సులేమాన్ ఆనందంతో చిరునవ్వులు చిందిస్తూ తన గదిలోకి వెళ్ళేందుకు ఉద్యుక్తుడయాడు.

ఎందుకోగాని వెంటనే వెనక్కి తిరిగాడు.

ముక్కుపుటాలు ఎగురవేశాడు.

ఉన్నట్టుండి అతని ముక్కు పుటాలకి ఏదో కాలుతూన్న వాసన తగిలింది.

"ఏదో కాలుతూన్న వాసన వస్తుందేమిటి?"

ఇమ్రాన్ ఇరకాటంలో పడ్డాడు. అతని పై ప్రాణాలు పైనే పోయినట్లు అనిపించింది.

సంజయ్, ఇమ్రాన్‌లు మూలన కాలుతూన్న సిగరెట్ మూలాన కార్పెట్ లోంచి పొగ రావడం గమనించారు.

వాళ్ల చూపుల్ని గమనించి సులేమాన్ కూడా అటుకేసి చూశాడు. వెంటనే మూలకి వెళ్ళి బూటు కాలితో సిగరెట్టునిపలిపేశాడు. వెనక్కి తిరిగి సంజయ్ కేసి కోపంగాచూశాడు.

"సంజయ్! ఆఫీసులో సిగరెట్ కాల్చడం నాకు ఎంత మాత్రం ఇష్టం వుండదన్న విషయం మీకు స్పష్టంగా తెలుసు" సులేమాన్ మాటల వెనక వున్న ఆగ్రహం స్పష్టంగా అర్థమైంది సంజయ్‌కి.

"ఐ యామ్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ సర్!" సిగ్గుతో తల వంచుకున్నాడు సంజయ్.

## మోహన్ 'బాబూ ఎమ్మెల్యే'

విలక్షణ నటుడు మోహన్‌బాబు సూపర్ డూపర్ హిట్ చిత్రం "పెదరాయుడు" తరువాత తన శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ బ్యానర్‌పై త్వరలో నిర్మించబోయే చిత్రం 'బాబూ ఎమ్మెల్యే' ఫ్యామిలీ సెంటిమెంట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ కొద్దిగా పొలిటికల్ టచెస్‌తో ఈ చిత్రం రూపుదిద్దుకుంటుందట! ఇప్పటి వరకూ 26 కోట్ల రూపాయిలను వసూలు చేసిన 'పెదరాయుడు' చిత్రం 200 రోజుల వేడుకలకు ఎన్.టి.రామారావు, ఎన్. చంద్రబాబు నాయుడులు ముఖ్య అతిథులుగా తిరుపతిలో భారీ ఎత్తున జరపడానికి కలెక్షన్‌కింగ్ సన్నాహాలు చేస్తున్నారు. – బాషా



సులేమాన్ కోపంగా అతనికేసే చూస్తూ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

సులేమాన్ గదిలోకి వెళ్ళిపోవడంతోనే ఇమ్రాన్ వచ్చి సంజయ్ చేతులు పట్టుకుని కృతజ్ఞత చెప్పుకున్నాడు.

డాక్టర్ భార్గవకి విషయం అర్థమయింది.

"అయితే ఇది తమ నిర్వాకం అన్నమాట" అన్నాడు డాక్టర్ భార్గవ ఇమ్రాన్‌కేసి చూస్తూ.

"కాదు... అవును డాక్టర్!" తప్పను అంగీకరించాడు ఇమ్రాన్.

"నువ్వు చేసిన ఈ తప్పు సులేమాన్ దృష్టికి రాలేదు కాబట్టి ఆయన నీకు శిక్ష విధించలేదు. కానీ నేను మాత్రం నీకు శిక్ష విధించకుండా వదలి పెట్టను"

ఇతని సిగరెట్ల అలవాటుసుమాన్పించగల ఇంజెక్షన్ ఏదైనా వుందా డాక్టర్!" నవ్వుతూ అడిగాడు సంజయ్.

"లేదు..." గంభీరంగా వుంది డాక్టర్ భార్గవ స్వరం. "ఇక ఇతనికి పెళ్ళి చేసేసి శాశ్వతంగా కట్టి పడేసేలా చేస్తాను"

"ఎందుకు డాక్టర్?" ఆసక్తిగా అడిగాడు ఇమ్రాన్.

"ఎందుకా? షాహీన్ వస్తేనే గాని నీలోఫర్ మహల్‌కున్న అందం ఇనుమడించదు"

"థ్యాంక్యూ డాక్టర్!" ఇమ్రాన్ చాలా సంతోషంగా సమాధానం చెప్పినప్పటికీ తన అధైర్యానికి తనే తలవంచుకున్నాడు.

డాక్టర్ భార్గవ, సంజయ్‌లు పగలబడి నవ్వారు.

ఇంతలో ఇంటర్‌కమ్ మోగింది.

సులేమాన్ ఇమ్రాన్‌ని పిలిచాడు.

ఇమ్రాన్ లోపలికి వెళ్ళాడు.

"చాలా బాధ్యత గల కుర్రవాడు. బాగా పైకి వస్తాడు" ఇమ్రాన్‌ని గురించి సంజయ్‌తో అన్నాడు డాక్టర్ భార్గవ.

"అందుకే సులేమాన్ పూర్తిగా అతనిని నమ్ముతున్నారు"

"ఆయనకు నీ మీద కూడా నమ్మకం పెరుగుతోంది. ఈ రోజు నాతో చాలా సన్నిహితంగా మాట్లాడారు. ఇమ్రాన్, సంజయ్‌లు గనుక ఇక్కడి వ్యవహారాలు చూసుకోగలిగినట్లయితే తాను స్విట్జర్లాండ్ వెళ్ళాలనుకుంటున్నట్టు చెప్పాడు"

"నాకూ, ఇమ్రాన్‌కీ చాలా తేడా వుంది డాక్టర్‌గారూ. ఇమ్రాన్ యజమానీ, నేను ఉద్యోగిని. ఉద్యోగి ఎప్పటికీ యజమాని స్థానానికి చేరుకోలేడు"

"అలా మనసుని చిన్నబుచ్చుకోవలసిన అవసరం లేదు సంజయ్! ఏ రోజు ఎలా వస్తుందో చెప్పలేం. ఎవరి అదృష్టం ఎలా మలుపు తిరుగుతుందో కూడా వూహించలేం." డాక్టర్ భార్గవ అర్థమయ్యేట్టుగా, సంజయ్‌కి చెప్పటానికి ప్రయత్నించి ఆ తర్వాత టాపిక్ మార్చాడు.



"అవునూ, ఇంటి దగ్గర్నుంచి ఉత్తరం ఏమైనా వచ్చిందా?" అని అడిగాడు.

"వచ్చింది. నాన్న రాశారు. అంతా క్షేమమే. హేమక్కా, బావగారు కూడా క్షేమమే. మిమ్మల్ని దీవిస్తున్నట్టు చెప్పమని రాశారు."

"పెద్దల దీవెనలకు మించిన ఐశ్వర్యం లేదు సంజయ్!"

"ఈ రోజుల్లో ఎవరున్నారు సార్, అలాంటి ఐశ్వర్యాన్ని గౌరవించేవాళ్ళు. ప్రస్తుతం అంతా డబ్బే నిర్ణయిస్తుంది. డబ్బే దైవం. డబ్బే ధర్మం. డబ్బే సర్వస్వం!"

"నువ్వు చెప్పేది ముమ్మాటికీ నిజం. మనుషుల ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయింది. మనుషుల మధ్య ఆత్మీయమైనబంధాలు మాసిపోతున్నాయి. ఎవరిదాకానో ఎందుకు? మన విషయమే చూడరాదూ! కేవలం డబ్బు సంపాదన కోసం అయినవాళ్ళనీ, పుట్టి పెరిగిన దేశాన్నీ వదిలిపెట్టి రాలేదూ! ఇక్కడి వీళ్ళలో సంస్కృతి లేదు, తమదైన విలువలు లేవు. ఇక్కడ ఇమోషన్స్‌కి ఎంత మాత్రం విలువ లేదు. ఇది కేవలం వ్యాపారస్తుల దేశం. క్రయ విక్రయాలు తప్ప ఇక్కడ మరేం లేదు. ప్రతిదీ ఇక్కడ అమ్మకపు సరుకే. ఇక్కడ డబ్బుతో దేనినైనా సరే కొనుక్కోవచ్చు. ఇక్కడ ప్రతి ప్రశ్నకీ కేవలం ఒకే ఒక్క ప్రశ్న సమాధానంగా వినిపిస్తుంది– ధర ఎంత!"

డాక్టర్ భార్గవ హితోపదేశం ఇచ్చి వెళ్ళిపోయారు గానీ సంజయ్ మాత్రం ఆ ప్రభావం నుంచి ఇంకా తేరుకోలేదు.

సంజయ్‌లో ఒక ఆలోచనల తుఫాను చెలరేగింది.

డాక్టర్ భార్గవ ఎంతో గంభీరంగా ప్రశంసించిన ఈ అనుబంధాలు నిజంగా అంత గొప్పవేనా?

ఏమిటీ వాటికున్న విలువ?

నిజం ఆలోచిస్తే ఎంత బలహీనం– ఈ అనుబంధాలూ, ఆత్మీయతలూ!

ఐశ్వర్యం ఒకటే సర్వస్వం కాకపోవచ్చు.

కానీ మనిషి జీవితంలో దానికున్న స్థానం ఎవరూ కాదనటానికి వీల్లేనిది!

మనిషి జీవితం చాలా చిన్నది.

ఇదొక తిరుగులేని సత్యం.

ఈ చిన్ని జీవితంలోనే సాధ్యమైనంత పెద్ద ఐశ్వర్యవంతుడైతేనే తప్ప లోకంలో మనిషికి విలువ లేదు.

ఇది అంతకన్నా తిరుగులేని సత్యం.

డబ్బు! డబ్బు!! డబ్బు!!!

ఈ డబ్బు లేకపోవడం వల్ల తాను ఎన్ని ఆనందాల్ని కోల్పోయాడు!

డబ్బు లేకపోవడం తనకు స్వంతం కావలసిన ఎన్ని ఆనందాల్ని ఇతరులు నిర్దాక్షిణ్యంగా దోచుకున్నారు?

ఏం చేసి అయినా సరే డబ్బు సంపాదించాలి.

అంతులేని ఐశ్వర్యంతోనే తిరిగి తన దేశానికి వెళ్ళాలి.

తాను చూసిన కష్టాల్ని తన పిల్లలు కలలో కూడా చూడకూడదు.

తనకు డబ్బు కావాలి.

ఈ ఆలోచనలే తనని తరుముకుంటూ ఇక్కడికి తీసుకువచ్చాయి.

– సశేషం



## ధర్మేంద్ర ఆనందం

చిన్నకొడుకు బాబీడియోల్‌ను మొదటిసారిగా వెండితెరకు పరిచయం చేయడానికి 'బర్సాత్' అనే చిత్రాన్ని ధర్మేంద్ర మూడు సంవత్సరాలపాటు అన్ని జాగ్రత్త తీసుకుని భారీ ఎత్తున నానా కష్టాలుపడి నిర్మించాడు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం దేశవ్యాప్తంగా విజయభేరి మ్రోగిస్తోంది. బర్సాత్ విజయంపై ధర్మేంద్ర వ్యాఖ్యానిస్తూ "మూడేళ్ళపాటు నేనుపడిన కష్టాన్ని ఈ రోజున పూర్తిగా మరచిపోయాను. నా కొడుకులు సూపర్‌స్టార్స్ కావాలని నేనెప్పుడూ ఆశించను. వారిని ప్రజలు గుర్తిస్తే చాలు!" అంటూ ఆనందంగా చెప్పాడు.

– బాషా